క్లుప్తంగా

వైభవంగా సప్త శనివార సేవ

విజయవాడకల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీ శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో సప్త శనివార సేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంక భూషితుడైన శ్రీ దేవీ భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరునకు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలోని శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు లక్షతులసి అర్చన, శ్రీనారాయణ గాయత్రి పూర్వక సహస్రనామ పఠన కార్యక్రమం జరిగింది. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్ రావుకు నివాళి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావుకు ఆయన కుమార్తె బొప్పన సుష్మ, శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ పుష్ప నివాళులు అర్పించారు. పునాదిపాడులోని శ్రీచైతన్య గోసాల శ్రీవైభవి క్యాంపస్‌లో బీఎస్ రావు సంతాప సభ శనివారం నిర్వహించారు. సుష్మ, పుష్ప హాజరై బీఎస్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీచైతన్య గోసాల క్యాంపస్ స్థాపించిన నాటి నుంచి వివిధ విభాగాల్లో పనిచేసిన దిగువ స్థాయి ఉద్యోగులకు నగదును అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్స్, ఏజీఎం, ప్రిన్సిపాల్స్ పాల్గొని బీఎస్ రావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

'మణిపూర్ ఘటనపై పవన్ స్పందించాలి'

భవానీపురం(విజయవాడపశ్చిమ): మణిపూర్‌లో దళిత మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యాచారం చేసిన దుర్ఘటనపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించ లేదని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే పవన్ స్పందించాలని డిమాండ్ చేశారు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశ్నించేందుకే వారాహి యాత్ర చేస్తున్నాడా లేదా చంద్రబాబు ఆడించినట్లు ఆడటానికి తిరుగుతున్నాడా అంటూ మండిపడ్డారు. భవానీపురంలోని క్రైస్తవ శ్మశానవాటికకు వెళ్లి ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోవడం లేదని జనసేన నేత పోతిన మహేష్ గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్, మహేష్ తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రేపిస్టులు, ఉన్మాదులను రక్షిస్తున్న మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని కార్పొరేటర్, సీపీఎం నాయకుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో దళిత మహిళలపై ఇటీవల జరిగిన దుర్ఘటనకు నిరసన తెలుపుతూ సీపీఎం పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. భవానీపురం స్వాతి రోడ్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయం వద్ద నుంచి 'సేవ్ మణిపూర్ – సేవ్ ఇండియా' అంటూ నినదిస్తూ జరిగిన ఈ ర్యాలీలో సత్యబాబు మాట్లాడుతూ మణిపూర్‌లో మారణకాండ ఆపాలని, అక్కడ ప్రజలకు, మహిళలకు రక్షణ కల్పించలేని మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అచ్చేశ్వరరావు, ఎస్.సుబ్బారెడ్డి, ఎన్.పిచ్చిరెడ్డి, కె.రమణమ్మ, కుండనాల శేషుమణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయవాది మాగంటి అనూరాధ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, అమలు తీరుపై సదస్సు నిర్వహించారు. అనూరాధ మాట్లాడుతూ.. 10 మంది కన్నా ఎక్కువ మహిళలు పనిచేస్తున్న చోట అంతర్గత కమిటీలు వేయాలని, కార్యాలయాల్లో చట్టం అవగాహన కోసం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మరో న్యాయవాది చంద్ర రమాదేవి మట్లాడుతూ మహిళలు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకోవాలన్నారు. విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సదస్సులో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి, సెక్రటరీ సరస్వతి, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఎస్ఆర్ఆర్‌లో నాక్ బృందం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27, 28 తేదీల్లో నాక్ బృందం పర్యటిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నాలుగోవిడత నాక్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట

- రూ.87.50 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి



54వ డివిజన్‌లో పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నగరాభివృద్ధికి పెద్ద పీట వేశారని, వందల కోట్ల రూపాయల నిధులతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 54, 55 డివిజన్లలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి శనివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చంద్రబాబు నిర్లక్ష్య వైఖరితో నగరంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వందల కోట్ల రూపాయలు వెచ్చించి నగరాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. మధ్యలో వదిలేసిన ఫ్లైఓవర్ నిర్మాణాలు, పార్కులు, కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, వాటర్ ట్యాంకు నిర్మాణాలు తదితర అనేక పనులు పూర్తి చేశామన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం..

వరదలు సంభవించిన సమయంలో ప్రతిసారి కృష్ణలంక వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చేదని ఎమ్మెల్యే వెలంపల్లి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయడంతో కృష్ణలంక ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. అదే విధంగా నగరంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తక్షణమే వాటి పరిష్కారానికి నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 54, 55 డివిజన్లలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపు లైన్‌లు దెబ్బతినటంతో వాటిని తొలగించామని చెప్పారు. కొత్త పైపు లైన్ నిర్మాణానికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.87.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. అందులో 54వ డివిజన్‌లో రూ.44.20 లక్షలు, 55వ డివిజన్‌లో రూ.44.30 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయితే స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయన్నారు. ఇక్కడి ప్రజల ఉపయోగం కోసం మరో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, త్వరలోనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చంద్రబాబు వలంటీరే పవన్..

నిత్యం ప్రజలకు సేవలు చేస్తున్న వలంటీర్లను అవమానకరంగా మాట్లాడితే పవన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వెలంపల్లి హెచ్చరించారు. రాష్ట్రంలో వలంటీర్లు ప్రజలకు సేవ చేస్తుంటే.. పవన్ అనే వలంటీరు మాత్రం చంద్రబాబుకే సేవ చేసేందుకు వచ్చాడని ఎద్దేవా చేశారు. లోకేష్ ఎక్కడ పాదయాత్ర చేస్తున్నాడో ఎవరికీ తెలియదన్నారు. ఒళ్లు తగ్గించుకోవడానికి పాదయాత్ర చేస్తున్నాడే తప్ప ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబ్దుల్ అర్షద్, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో..



పాత ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు కేంద్రంలో ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు చికిత్స పొందుతుంటారు. ఆస్పత్రిలోకి ఒక రోగికి ఒక సహాయకుడిని మాత్రమే అనుమతిస్తారు. దీంతో రోగికి సాయంగా వచ్చిన మిగిలిన వారు ఆస్పత్రిలోని చెట్ల కింద ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై వేచి ఉంటారు. సహాయకుల కోసం వెయింటింగ్ హాలు ఉన్నా ప్రకృతి ఒడిలో చెట్ల కిందే సేదతీరుతారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్‌గా వర్షాపాటిల్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వర్షా పాటిల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్ ఆమెకు స్వాగతం పలికి బాధ్యతలను అప్పగించారు. వర్షాపాటిల్ డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ భార్య, ఆమె పుణే విశ్వవిద్యాలయంలో ప్రసూతి శాస్త్రం అభ్యసించి ఎండీ గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని గ్రాండ్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, జేజే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ముంబైలోని ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్‌గాను విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆర్గనైజేషన్ నిర్వహణలో ఉన్న ఆశా కిరణ్, డే కేర్ సెంటర్, స్ఫూర్తి యూనిట్‌లను సందర్శించి అక్కడ ఉన్న చిన్నారులతో మాట్లాడారు. డాక్టర్ జయమోహన్ ఆర్గనైజేషన్ నిర్వహణలో ఉన్న పలు యూనిట్‌లలో కార్యకలాపాలను ఆమెకు వివరించి, అకౌంటింగ్ పత్రాలను అందజేశారు.

25న ఉమ్మడి జిల్లా రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

కంకిపాడు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపిక ప్రక్రియ ఈ నెల 25న ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ శనివారం తెలిపారు. అండర్–8, 10, 12, 14, 17 బాల బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి స్కిప్పింగ్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

'జగనన్న సురక్ష'తో ఇంటి ముంగిటకే పాలన



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, సువర్ణరాజు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటికే పాలన అందిస్తున్నారని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు జక్కంపూడి సచివాలయం–3 పరిధిలోని వైఎస్సార్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్స్‌ను అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని వారికి అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇళ్ల ముంగిటకే అందజేస్తున్న వలంటీర్లను పవన్, చంద్రబాబులు దొంగల్లా, సంఘ విద్రోహుల్లా వ్యాఖ్యానించటం దుర్మార్గమన్నారు. మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలపై దుష్టచతుష్టయం దుష్ప్రచారాన్ని పట్టించుకోవద్దని కోరారు.

11 రకాల సేవలు

జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు 11 రకాల సేవలను అందిస్తున్నారని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు తెలిపారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నప్పుడు టీడీపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని పవన్‌ను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్, స్థానిక ఎంపీటీసీ కల్పన కిషోర్ మాట్లాడుతూ.. సినిమాల్లో నటిస్తూ రోజుకు రెండు కోట్ల రూపాయలను సంపాదిస్తున్నానని చెప్పుకునే పవన్ కళ్యాణ్ ఆంధ్రాలో ఎందుకు ఇల్లు కట్టుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓ భారతి, గేరా సుమన్, నక్కా ప్రభుదాస్, తన్నీరు పాపారావు, ముళ్ల లాజర్, టీఎల్ రాజు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర



భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశంలోని ముఖ్యమైన చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో నడుపుతున్న భారత్ గౌరవ్ యాత్ర రైలుకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర'ను చేపట్టింది. ఈ రైలు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలైన తిరువణ్ణామలై, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులను కవర్ చేస్తుంది. తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటలలో స్టేషన్లలో ఆగుతుంది. ఆగస్ట్ 9, 23, సెప్టెంబర్ 5 తేదీల్లో ప్రారంభమయ్యే ఈ యాత్ర కోసం బుకింగ్‌లు ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా కౌంటర్ బుకింగ్‌ల కోసం హైదరాబాద్ ఐఆర్‌సీటీసీ కార్యాలయం 040–27702407, 970 1360701, విజయవాడ కార్యాలయం 9281495848 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాల్సిందిగా అధికారులు కోరారు.

ప్యాకేజీ వివరాలు..

ఈ యాత్ర 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందన్నారు. ప్రయాణంలో ఉదయం కాఫీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, వసతి, రోడ్డు మార్గంలో రవాణా సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రయాణం అంతటా టూర్ ఎస్కార్ట్‌లు, రైలులో భద్రతకు సీసీ కెమెరాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సౌకర్యంతో పాటు ప్రయాణ బీమా సౌకర్యాలు కల్పించారు. ప్యాకేజీలో స్లీపర్ క్లాస్‌కు రూ.14,300, 3 ఏసీకి రూ. 21,900, 2 ఏసీకి రూ. 28,500 రేట్లు నిర్ణయించారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కోమల విలాస్ కొండ ప్రాంతానికి చెందిన జోడు స్వప్న, రామస్వామి భార్యభర్తలు. వీరిద్దరి మధ్య విభేదాల కారణంగా కొంత కాలంగా స్వప్న భర్తకు దూరంగా ఉంటుంది. రెండేళ్లుగా శివకుమార్ అనే వ్యక్తి స్వప్న వెంట పడి పెళ్లి చేసుకుంటానని వేధించసాగాడు. శనివారం శివకుమార్ స్వప్నపై దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువతలో జాతీయ భావం పెంపునకు కృషి



కుచేల చరిత్ర గ్రంథ ఆవిష్కరణ సభలో విజయాదిత్య, పాలపర్తి, చక్రధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: యువతలో జాతీయ భావం పెంచడానికి కృషి చేయాల్సిన అవసరముందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య అన్నారు. జాతీయ కవితా వేదిక ఆధ్వర్యాన శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు కవి జింకా శంకరయ్య పంతులు 1927 లో రచించిన కుచేల చరిత్ర, గోపికా వస్త్రాభరణం గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. విజయాదిత్య మాట్లాడుతూ నాడు ఎంతోమంది సమరయోధులు త్యాగాలతో నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని చెప్పారు. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర సాహిత్యంలో ఎన్నో గ్రంథాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వందేళ్ల క్రితం రాసిన గ్రంథాన్ని పునః ముద్రించిన జాతీయవాద కవితా వేదిక నిర్వాహకుడు జింకా చక్రధర్ కృషిని అభినందించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకుడు డాక్టర్ ఉపద్రష్ట వేంకటరమణమూర్తి, రచయిత దుగ్గరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు. హరిబాలాశంకర్ గ్రంథ విశేషాలను తెలియజేశారు. కోర్సిపాటి శ్యాంప్రసాద్ రెడ్డి నిర్వహణలో జాతీయ వాదం అంశంగా జరిగిన కవి సమ్మేళనంలో వివిధ ప్రాంతాల కవులు చేసిన స్వీయ కవితా గానం ఆసక్తికరంగా సాగింది.

కొండ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం చెరువు సెంటర్ సమీపంలో 157వ వార్డు సచివాలయం పరిధిలోని మణెమ్మ బడ్డీ కొట్టు దగ్గర నుంచి కొండపైకి వెళ్లే మార్గంలో పలు అభివృద్ధి పనులకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుండటం గత ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కొండప్రాంత వాసులు తాము ఎదుర్కొంటున్న అవస్థలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించే వెలంపల్లి అధికారులతో మాట్లాడి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.20 లక్షల నిధులతో నూతనంగా మెట్లు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, సచివాలయ సెక్రటరీ హర్షిత, నాయకులు మంగిపూడి ఆది, స్థానికులు పాల్గొన్నారు.

కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



కానూరులో క్రికెట్ మ్యాచ్‌లను పార్రంభించిన కెనరా బ్యాంక్ జీఎం రవివర్మ, రత్నప్రసాద్

పెనమలూరు: క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండొచ్చని కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించి ప్రసంగించారు. క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి దూరమవడమే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవితం గడపవచ్చని సూచించారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు పని ఒత్తిడి లేకుండా చేయటానికి యాజమాన్యం దేశవ్యాప్తంగా సర్కిళ్ల పరిధిలో పురుష ఉద్యోగులకు క్రికెట్ పోటీలు, మహిళలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఉద్యోగులు కూడా పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.వి.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, కెనరా బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో 13 జట్లు

కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలో 13 జట్లు పాల్గొన్నాయి. మొదటి రోజు విజయవాడ సర్కిల్ జట్టు కాకినాడ ఆర్ఓ జట్టుపై, వైజాగ్ 2 ఆర్ఓ జట్టు కర్నూల్ ఆర్ఓ జట్టుపై, నెల్లూరు ఆర్ఓ జట్టు వైజాగ్ ఆర్ఓ1 జట్టుపై, విజయవాడ ఆర్ఓ జట్టు ఒంగోలు జట్టుపై గెలుపొందాయి. ఆదివాకం కూడా పోటీలు కొనసాగుతాయి.

ట్రస్టు జాయింట్ కేర్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడి



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట రమణ, పక్కన భార్గవ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కీళ్ల మార్పిడిలో అత్యాధునిక పరిజ్ఞానమైన రోబోటిక్ శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చామని ట్రస్టు జాయింట్‌కేర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ యు.వెంకటరమణ తెలిపారు. అందుకోసం ఫుల్లీ ఆటోమేటిడ్ రోబో క్యువిస్ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కీళ్ల సంరక్షణ, దెబ్బతిన్న కీళ్ల పనితీరును పునరుద్దరించే లక్ష్యంతో ప్రత్యేక కేంద్రంగా ట్రస్టు జాయింట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విదేశాల్లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన వైద్యులు, అధునాతన జాయింట్ సేవింగ్ కార్టిలేజీతో పునరుత్పత్తి చికిత్సలు, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, జర్మనీల్లో ఆర్థోస్కోపీ, రోబోటిక్ శస్త్రచికిత్సల్లో శిక్షణ పొందిన డాక్టర్ భార్గవ్‌రామ్ మాట్లాడుతూ ఆర్థో రోబోటిక్ విధానం ద్వారా కచ్చితమైన కోత, పరిపూర్ణ అమరిక, తక్కువ నొప్పి, సహజసిద్ధమైనదిగా ఉంటే జాయింట్ రీప్లేస్‌మెంట్ సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో ఎనస్థీషియన్ డాక్టర్ ఎస్.పావనఫణి పాల్గొన్నారు.

అట్టహాసంగా నృత్య నీరాజనం ప్రారంభం



నాట్యాచార్యుడు శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే నృత్య నీరాజనం 2023 కార్యక్రమాలు వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాట్యాచార్యులు సప్త శివకుమార్, మాగలూరి త్రినాథాచారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వాగ్గేయకార కీర్తనలకు కూచిపూడి, భరతనాట్యం, సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ నృత్యాలకు కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. భారతీయ నృత్య సంప్రదాయాలు దేశ కీర్తి ప్రతిష్టలను చాటుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్, గాయకుడు కుమార సూర్యనారాయణ పాల్గొన్నారు. నాట్యాచార్యుడు రఘుపాత్రుని శ్రీకాంత్‌కు నాట్య విజ్ఞాన్ బిరుదుతో సత్కరించారు.

విద్యా రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం



పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఉపాధ్యాయులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యా రంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ దేవి మున్సిపల్ స్కూల్‌లో సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాల పంపిణీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మరుపిళ్ల రాజేష్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడు చదువుకోవాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలలను నాడు–నాడు కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.